క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో లక్ష్మీగణపతి హోమం



హోమంలో పాల్గొన్న ఆలయ అధ్యక్షుడు మూర్తి, అర్చకులు, భక్తులు

సీతమ్మధార: సంకటహరి చతుర్థి సందర్భంగా 14వ వార్డు గణేష్‌నగర్‌లోని శ్రీముఖ విఘ్నేశ్వర పంచాయతన ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు భాస్కరరావు ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు టి.ఎస్.ఎన్.మూర్తి, కార్యవర్గ సభ్యులు ఎం.ఎస్.ప్రకాశరావు, జి.కృష్ణ, టి.వెంకటరావు, ఎం.సత్యనారాయణ, బి.కె.నాయుడు, వెంటకలక్ష్మి, పి.వి.రమణ, మహాలక్ష్మి, రమణమ్మ, భక్తులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ శుభ్రం

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో పలు సమస్యలపై రెండు రోజుల కిందట జోన్–5 కమిషనర్‌కు మహత్ కాలనీ, భీమ్‌నగర్ కాలనీల వాసులు విన్నవించారు. ఈ క్రమంలో జెడ్సీ బి.రాము సిబ్బందితో మాట్లాడి తక్షణమే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ మేరకు బుధవారం భీమ్‌నగర్‌లోని 20 వేల లీటర్ల వాటర్ ట్యాంక్‌ను సిబ్బంది శుభ్రపరిచారు. 24 గంటల్లోనే సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

వైద్యాధికారుల పర్యటన

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డులో బుధవారం వైద్యాధికారులు పర్యటించారు. సాయి రాంనగర్ కొండవాలు ప్రాంతం, పాస్‌పోర్ట్ కార్యాలయం పక్కనే ఉన్న కాలువలను జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ నరేష్‌కుమార్, హెల్త్ ఆఫీసర్ సునీల్ కుమార్ పరిశీలించారు. శానిటరీ అధికారులకు తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, శానిటరీ సూపర్‌వైజర్లు చిరంజీవి, గణేష్, ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నియంత్రణపై అవగాహన



అపార్ట్‌మెంట్ వాసులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

మద్రిపాలెం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం 51వ వార్డు మాధవధారలోని లేన్సమ్‌గ్రీన్స్ అపార్ట్‌మెంట్‌లో అదనపు జిల్లా అగ్నిమాపక అధికారి (ఏడీఎఫ్‌వో) కె.వి.టి.ప్రసాదరావు సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపార్ట్‌మెంట్ వాసులకు ఎలక్ట్రికల్ షార్ట్‌సర్క్యూట్, వంటగదిలో గ్యాస్ ఫైర్ తదితర విషయాలపై జాగ్రత్తలు, అగ్నిప్రమాదాల నియంత్రణకు తీసుకోవాల్సిన భద్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

పందుల స్వైరవిహారం



మాధవధారలో నివాసాల మధ్య పందుల గుంపు

మద్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు మాధవధార జంక్షన్‌లోని గెడ్డలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. గెడ్డ మురుగులో సంచరించి వెనుక భాగంలో ఉన్న నివాసాల వీధుల్లో తిరుగుతూ జనావాసాల మధ్య తిష్ట వేస్తున్నాయి. ఇళ్ల మధ్యలో గుంపులుగా పందులు ఉండటంతో స్థానికులు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాటి బెడద ఎక్కువగా ఉంటోందని, రోగాలు ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గెడ్డలో మురుగుతో దోమలు సైతం దాడి చేస్తున్నాయని వాపోతున్నారు. జనావాసాల మధ్య తిరుగుతున్న పందులను దూరంగా తరలించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వెలగని లైట్లు.. తప్పని పాట్లు



ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహం వద్ద వెలగని వీధి దీపం

అంధకారంలో మాధవధారలోని పలు ప్రాంతాలు

స్ట్రీట్ లైట్ల నిర్వహణపై శీతకన్ను

పట్టించుకోని అధికారులు



ఈస్ట్ పార్కు ముందు వెలగని వీధిలైటు



నరసింహనగర్‌లో వెలగని స్ట్రీట్ లైట్



కళింగనగర్ బస్టాప్ వద్ద వెలగని జంట లైట్లు



విజేత సూపర్ మార్కెట్ వద్ద వెలగని లైటు

మద్రిపాలెం: మాధవధారలో చాలాచోట్ల అంధకారం నెలకొంది. అసలే రోజులు బాగాలేవు.. ఒంటరిగా ఎక్కడికైనా వెళ్లాలంటే భయపడే రోజులు.. అలాంటిది రాత్రి వేళ వీధిలైట్లు వెలగకపోతే మరింత భయంతో బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు స్థానికులు. ఈ క్రమంలో మాధవధార ప్రధాన రహదారిపై సుమారు 20 నుండి 25 వరకు వీధి దీపాలు వెలగడంలేదు. రోడ్డుపై వెళ్లే వాహనాల వెలుగులు, అపార్టుమెంట్లు, షాపుల్లో లైట్ల వెలుగులే ఆయా ప్రాంతాల్లో ఆధారం అవుతున్నాయి. అవి కూడా లేకపోతే అంధకారమే. ఎన్నిసార్లు చెప్పినా అధికారులు ఎందుకింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కొందరు ప్రశ్నిస్తున్నారు. అడుగడుగునా ప్రతిరోజూ వీధి దీపాల నిర్వహణలో ఎందుకు ఇంత అలసత్వం అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్నిరోజుల ముందు వరకు పగలు వీధి దీపాలు వెలుగుతూనే ఉండేవి. అప్పుడూ పట్టించుకోలేదు. ఇప్పుడు కాలనీల్లో చీకట్లు రాజ్యమేలుతున్నా పట్టించుకోవడం లేదు. అసలే ఈ రోడ్డులో రద్దీ ఎక్కువ. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ రోడ్డును అభివృద్ధి చేయడంతో అంతా దీన్నే వాడుతున్నారు. ముఖ్యంగా హైవే మీదుగా వెళ్తే సిగ్నల్స్ ఇబ్బంది ఉంటుందని ఈ రోడ్డును ఎక్కువగా వినియోగిస్తున్నారు. జాతీయ రహదారికి సమానంగా ఈ రోడ్డు ఉండటం కూడా మరో కారణం. అందులోనూ 48 బస్సు రూట్ కూడా కావడంతో ఈ రోడ్డు ఎప్పుడు చూసినా రద్దీగానే ఉంటుంది. పగలు బాగానే ఉన్నా రాత్రివేళల్లో ఇక్కడ వీధి దీపాలు లేకపోవడంతో వాహనాల లైట్లే ఆధారం అవుతున్నాయి. అదే విధంగా 48 లాస్ట్ బస్టాప్ వుడా కాలనీలో అయితే ఎప్పుడూ చీకటే. ఈ రోడ్డు అర కిలోమీటర్ మేర ఉంటుంది. ఇందులో కొంత మేర లైట్లు లేవు. అయినా ఎవరూ పట్టించుకోవడంలేదు. ఇక కొండ వైపు నుండి 48 బస్టాప్ వరకు రావాలంటే రెండు మూడు లైట్లు వరుసగా ఉన్నా మళ్లీ జంక్షన్ వరకు లైట్లు లేవు. దీంతో అక్కడ చీకటి రాజ్యమేలుతుంటుంది. వుడా కాలనీ బస్ మలుపు తిరిగే చోట పగలు రాత్రి తేడా లేకుండా ఆకతాయిలు సిగరెట్లు, మద్యం సేవిస్తుంటారు. మహిళలు ఒంటరిగా వెళ్లాలంటే భయపడుతున్నారు. ఇటీవల ఈ ప్రాంతంలో దొంగతనాలు కూడా జరుగుతున్నాయని పలువురు చెబుతున్నారు. గంజాయి, మద్యం సేవించి ఆకతాయిలు రాత్రివేళల్లో రెచ్చిపోతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకోవాలని వారు కోరుతున్నారు. ఇదిలా ఉండగా రాంసాయి పార్లర్, ఈస్ట్ పార్కు, విజేత సూపర్ మార్కెట్, 48 లాస్ట్ బస్టాప్, విద్యుత్ కార్యాలయం వంటి చాలా చోట్ల వీధి దీపాలు వెలగడంలేదు. రాంసాయి పార్లర్, కళింగనగర్ బస్టాప్ వరకు, అలాగే మాధవధార జంక్షన్ నుంచి బిర్లా జంక్షన్ వైపు వెళ్లే దారిలో మాధవ యువజన సమాజం వరకు కూడా కొన్ని వీధి దీపాలు వెలగడంలేదు. అంతే కాక రాంసాయి పార్లర్ జంక్షన్ నుండి పంజాబ్ హోటల్‌కు వెళ్లే దారిలో ఒక చోట రింగ్‌లైట్ వెలగడంలేదని, అలాగే లోపల నరసింహనగర్ తదితర ప్రాంతాల్లో కూడా పలుచోట్ల వీధి దీపాలు వెలగడంలేదని స్థానికులు చెబుతున్నారు. మొత్తంగా ప్రధాన రహదారి, ఇతర ప్రాంతాలతో కలుపుకుని మొత్తంగా కనీసం 20 నుండి 25 వీధి దీపాలు వెలగడం లేదంటే అధికారుల నిర్లక్ష్యం ఎంతలా ఉందో అర్థమవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి లైట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

నటులందరికీ మార్గదర్శకుడు చార్లీ చాప్లిన్



చార్లీ చాప్లిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ప్రపంచ హాస్య నటుడు చార్లీ చాప్లిన్ జయంతి ఘనంగా నిర్వహించారు. సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు, బి.చిన్నారావు తదితరులు చాప్లిన్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రకాశరావు మాట్లాడుతూ నటనలో తనదంటూ ప్రత్యేక శైలిని అలవర్చుకున్న చాప్లిన్ విశ్వ మానవుడని, నటులందరికీ మార్గదర్శకుడని కొనియాడారు. ప్రపంచ సినీ రంగంలో సృజనాత్మకతతో మూకీల యుగంలో సాంకేతిక ఇబ్బందులను అధిగమించాడన్నారు. విషాదంతో కూడిన తన నటనతో ప్రేక్షకులకు హాస్యాన్ని పంచిన చార్లీ చాప్లిన్ మరణం లేని కళాకారుడని కొనియాడారు. అనంతరం చాప్లిన్ దర్శకత్వంలో 1936లో విడుదలై సంచలనం సృష్టించిన మోడరన్ టైమ్స్ చిత్రాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో సంస్థ కోశాధికారి హుస్సేన్, జాయింట్ సెక్రటరీ చాట్ల బాబూరావు, కార్యవర్గ సభ్యులు బాబ్జి, రాంప్రభు, కుమారి, అనూరాధ పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

సీతమ్మధార: ఉద్యోగ నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వివాహిత అదృశ్యమైన ఘటనపై ఫోర్త్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా.. అక్కయ్యపాలెం సంఘం ఆఫీస్ ప్రాంతానికి చెందిన పువ్వల రమేష్‌కు కావ్యశ్రీతో కొన్నేళ్ల కిందట వివాహం జరిగింది. భర్త ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్‌లో పని చేస్తున్నాడు. భార్య ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఉపాధ్యాయినిగా చేస్తోంది. మంగళవారం ఉదయం 11.30 గంటల సమయంలో ఉద్యోగం నిమిత్తం బయటకు వెళ్లిన కావ్యశ్రీ తిరిగి ఇంటికి రాలేదు. ఫోన్ అందుబాటులో లేక బంధువుల ఇళ్లల్లో వెతికినా కనిపించకపోవడంతో ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో భర్త ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వసతి గృహంలో 12 మందికి ఆశ్రయం



వసతి గృహంలో నిరాశ్రయులు

సీతమ్మధార: రైల్వే స్టేషన్ చుట్టు పక్కల నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో దీన స్థితిలో ఉన్న 12 మంది నిరాశ్రయులను గుర్తించి ఏయూటీడీ జీవీఎంసీ వసతి గృహాలకు తరలించినట్లు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. మాధవ (55, మైసూర్), సిరామ్ (50, తమిళనాడు), శ్రీనివాసరావు (45, విజయవాడ), సాయిబాబా (50, బరంపురం, ఒడిశా), మల్లు (45, కర్ణాటక), వెంకటరావు (55, సేవానగర్, విశాఖపట్నం), గోపాల్ (65, బరంపురం, ఒడిశా), శంకర్ (45, మంచిర్యాల, తెలంగాణ), నాగరాజు (55, విజయవాడ), సింహాచలం (50, పాలకొండ, శ్రీకాకుళం జిల్లా), సుధాకర్ (45, ఒడిశా), దేవ (70, జగదల్పూర్, ఛత్తీస్‌ఘడ్) అనే వ్యక్తులు ఉన్నట్లు తెలిపారు. వీరిలో మానసిక రోగులకు వైద్యం అందిస్తామని, మిగిలిన వారిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని వాసు తెలిపారు.

నేటి నుంచి ప్లేస్‌మెంట్ డ్రైవ్

దాబాగార్డెన్స్: రాంనగర్‌లోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఈ నెల 17, 18, 19 తేదీల్లో మహా ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్. శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ ఎన్. సుగుణారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షాహిద్ అలీ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రపంచ దిగ్గజ ఐటీ కంపెనీ టీసీఎస్ (ఐటీ) ఈ క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తోందని, 75 మంది హెచ్‌ఆర్‌లు, 900కు పైగా విద్యార్థులు డ్రైవ్‌లో పాల్గొంటున్నట్టు చెప్పారు.

లలితా పీఠంలో సంకటహర చతుర్థి పూజలు



గణపతికి తామర పువ్వులతో పూజ



పీఠంలో భైరవ గణపతి హోమం చేస్తున్న అర్చకులు, భక్తులు

సీతంపేట: సంకటహర చతుర్థి సందర్భంగా బుధవారం లలితానగర్ లలితా పీఠంలో విజయ గణపతికి పంచామృతాభిషేకం, అర్చన, అలంకరణ, తామర పువ్వులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం అర్చకుల మంత్రోచ్ఛారణల నడుమ దూప దీప నైవేద్యం, గణేశ స్తోత్రం, వ్రత కథ చదివారు. అనంతరం పీఠం దర్బారు హాల్లో శాస్త్రోక్తంగా భైరవ గణపతి హోమం జరిపారు. ఈ హోమం వల్ల కార్యసిద్ధి, ఆరోగ్యం, విజయం లభిస్తాయని అర్చకులు తెలిపారు. బహుళ అష్టమి సందర్భంగా ఈ నెల 21న ఉదయం 9:30 గంటలకు చండీ హోమం నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాలు



కేఆర్‌ఎం కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

మద్దిలపాలెం: విశాఖ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలో సీడీపీవో ఎంవీ రమణకుమారి, ఏసీడీపీవో శ్రీలత ఆదేశాల మేరకు పౌష్టికాహార పక్షోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం మద్దిలపాలెం కేఆర్‌ఎం కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ సంరక్షణపై వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించామని అంగన్‌వాడీ కార్యకర్త ఆర్.సుబ్బలక్ష్మి తెలిపారు. వెయ్యి రోజుల పోషణ సంరక్షణలో తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్య జాగ్రత్తలను పిల్లల తల్లులు, గర్భిణులు, బాలింతలకు వివరించారన్నారు. చిన్నారుల ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటుకు సిఫారసు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీతారాం

మహారాణిపేట: కేజీహెచ్‌లోని జనన ధ్రువీకరణ పత్రాల జారీ కేంద్రం ఆవరణలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసేలా అధికారులకు సిఫారసు చేయనున్నట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం చెప్పారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఏర్పాటు చేసిన నూతన జనన ధ్రువీకరణ పత్రాల జారీ కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. అనంతరం జరిగిన సమీక్షలో సీతారాం మాట్లాడుతూ తల్లిదండ్రులు, పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దరఖాస్తుల స్వీకరణ, తప్పొప్పుల సవరణ చేసి 24 గంటల్లోగా పత్రాలు అందజేయగలగడం ఉత్తరాంధ్ర బాలల విజయమన్నారు. పుట్టిన బిడ్డ తల్లిదండ్రుల పేర్లలో తప్పులు, వివాహం తర్వాత తల్లి ఇంటి పేరు తండ్రి ఇంటి పేరుగా మార్పు వంటివి నూటికి నూరు శాతం తప్పులు లేకుండా అందించడంపై ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తన దృష్టికి తెచ్చారని అన్నారు. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని ఇక్కడ ఆధార్ ప్రత్యేక కేంద్రం ఏర్పాటు జరిగేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కేజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వి.రవి, ఆంధ్రా మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.వి.ఎస్.ఎం.సంధ్యాదేవి, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి.వి.రమణ, సి.ఎస్.ఆర్.ఎం.వో. జి.మెహర్ కుమార్, చిన్న పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ బి.ఎస్.చక్రవర్తి, ప్రసూతి విభాగం వైద్యులు డాక్టర్ కె.శ్యామల, డాక్టర్ సువిధ, స్టాటిస్టికల్ అధికారి దయానిధిరావు, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ శంకరరావు, నోడల్ ఆఫీసర్ శ్రీకళ, ఎంఆర్‌వో ఎం.ఎస్.జవహర్, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్లు ఎం.వి.రమణ కుమారి, శ్రీలత, ప్రొటెక్షన్ ఆఫీసర్ బి.మమత, వన్ స్టాప్ సెంటర్ ప్రతినిధులు శరణ్య, మాలతి, శాంత, సుజాత, రామలక్ష్మి, కౌన్సిలర్ శకుంతల, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

23న ఎస్.జానకి పాటల సంగీత విభావరి

ఎంవీపీకాలనీ: ప్రముఖ గాయని ఎస్.జానకి జన్మదిన వేడుకలు ఈ నెల 23న మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం వేదికగా జరగనున్నాయి. యాక్మి, చౌదరి క్రియేషన్స్, ఎంవీఆర్ ఈవెంట్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమ పోస్టర్‌ను బుధవారం ఎంవీపీ కాలనీలో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. వేడుకల్లో భాగంగా ఎస్.జానకి పాడిన పాటలతో సినీ సంగీత విభావరి ఏర్పాటు చేస్తున్నట్లు యాక్మి అధ్యక్షుడు ప్రతాప్ తెలిపారు. మిలీనియం శేఖర్ ఆర్కెస్ట్రా ద్వారా సింగర్లు మాళవిక, హితేష్‌సాయి తదితరులు మధురగీతాలను ఆలపిస్తారన్నారు. ప్రముఖ ఫ్లూట్ మాస్ట్రో తాళ్లూరి నాగరాజు, మణి దంపతులను సత్కరించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొనున్నట్లు వెల్లడించారు.

ఘనంగా ఉర్దూ పాఠశాల వార్షికోత్సవం



ఎస్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో బాలామణి



డ్యాన్స్‌తో అలరిస్తున్న విద్యార్థినులు

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు ముస్లిం తాటిచెట్లపాలెంలోని జీవీఎంసీ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాల 107వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. 1918లో స్థాపించిన ఈ పాఠశాల హెచ్‌ఎం పి.శాంతికుమారి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్య అతిథి ఎంఈవీ బాలామణి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నతంగా రాణించాలన్నారు. చదువుతోపాటు ఆటపాటల్లో ప్రతిభ చూపాలన్నారు. పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకుని, పాఠశాలలోని సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎస్‌ఎంఎంఎస్)కు ఎంపికైన 8వ తరగతి విద్యార్థులు షేక్ తస్నీం, పి.యశ్వంత్, ఎన్.ఉమామహేష్‌లను ఆమె అభినందించారు. వీరికి ఇంటర్ వరకు ఏటా రూ.12 వేలు స్కాలర్‌షిప్ ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. వచ్చే ఏడాది మరింత మంది అర్హత సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి.

ఇంటర్ టాపర్లకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ విశ్వనాథం, ప్రిన్సిపాల్ రత్నశేఖర్

సీతంపేట: ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ద్వారకానగర్ బీవీకే కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఇంటర్ సెకండియర్ ఎంపీసీ విభాగంలో సఞ్జున్నీసా 951/1000, బైపీసీ విభాగంలో హర్షిత దీప్తి 945/1000, సీఈసీ విభాగంలో ఊర్వశి శర్మ 938/1000, ఎంఈసీ విభాగంలో ఆశిష్ చంద్ర 888/1000 మార్కులు సాధించి కళాశాల టాపర్స్‌గా నిలిచారు. ఫస్టియర్ ఎంపీసీలో ఎం.లావణ్య 458/470, బైపీసీలో దాస్ సునీల్ 416/440, సీఈసీలో ఎం.అభిషేక్ 434/500, హెచ్‌ఈసీలో ఎం.ధృతి శ్రీపాద 473/500, ఎంఈసీ విభాగంలో ఎం.సుశీల 463/500 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో ఇంటర్ టాపర్లను బీవీకే విద్యా సంస్థల చైర్మన్ ఆచార్య జి.నాగేశ్వరరావు, కార్యదర్శి వి.రామ సత్యనారాయణ, బోర్డ్ డైరెక్టర్లు, కరస్పాండెంట్ కందర్ప విశ్వనాథం, ప్రిన్సిపాల్ పి.రత్నశేఖర్ అభినందించారు.

పవర్ లిఫ్టింగ్‌లో బుల్లయ్య కళాశాల విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: ఇటీవల గుడివాడలో నాలుగు రోజుల పాటు జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో లంకపల్లి బుల్లయ్య కళాశాల డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రతిభ చాటారు. సివిల్ ఇంజినీరింగ్ ఫైనలియర్ విద్యార్థిని జి.సి.ఆర్.అనూష 76 కిలోల విభాగంలో రెండు రజత పతకాలు, బీకాం సెకండియర్ విద్యార్థి పి.భార్గవ్ 120 కిలోల విభాగంలో రెండు స్వర్ణ పతకాలు, బీఎస్సీ ఫస్టియర్ విద్యార్థి ఐ.ప్రవీణ్‌కుమార్ 59 కిలోల విభాగంలో రజత పతకం, బీఎస్సీ ఫస్టియర్ విద్యార్థి బి.వి.రేవంత్‌రెడ్డి 105 కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా బుధవారం వీరిని కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్‌చౌదరి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్లు బి.ఆర్.ఎస్.లక్ష్మణరెడ్డి, యు.గంగాభవానీ తదితరులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఈవో రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి బుధవారంలాగే ఈ వారం కూడా భక్తులు అమ్మవారికి స్వయంగా జలాభిషేకం చేశారు. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం కూడా భక్తులు అమ్మవారికి జలాభిషేకం చేశారు. ఆలయ వర్గాలు భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

20న సిటు రాష్ట్ర కౌన్సిల్ సమావేశం

దాబాగార్డెన్స్: సిటు రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు ఈ నెల 20న అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించనున్నట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సమావేశాలకు సిటు అఖిలభారత అధ్యక్షురాలు డాక్టర్ కె. హేమలత, రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావుతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి 300 మంది ప్రతినిధులు కౌన్సిల్ సమావేశంలో పాల్గొంటున్నట్టు తెలిపారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించనున్నట్లు తెలిపారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు అఖిల భారత సమ్మెకు పిలుపునిచ్చాయని, సమ్మె విజయవంతం, మేడే ఉత్సవాల నిర్వహణకు ఈ సమావేశంలో చర్చిస్తామన్నారు. అలాగే విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత తదితర అంశాలపై చర్చలు జరగనున్నాయని, భవిష్యత్ పోరాటాలకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్. జ్యోతీశ్వరరావు పాల్గొన్నారు.

10,11 తేదీల్లో సీపీఐ మహాసభలు

అల్లిపురం: సీపీఐ విశాఖ జిల్లా 25వ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు తెలిపారు. ఈ మేరకు బుధవారం అల్లిపురం, సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న సీపీఐ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే జిల్లా పార్టీ మహాసభలు ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తేదీ సాయంత్రం కంచరపాలెం మెట్టు నుంచి ఓల్డ్ ఐటీఐ జంక్షన్ వరకు ప్రజా ప్రదర్శన ఉంటుందన్నారు. 11వ తేదీన మురళీనగర్‌లో గల బిస్వేర్ ఫంక్షన్ హాల్లో ప్రతినిధుల సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలలో గత మూడు సంవత్సరాలలో నిర్వహించిన ఉద్యమాలపై సమీక్ష ఉంటుందన్నారు. రాబోవు మూడేళ్లలో ఉద్యమ రూపకల్పన చేసుకుంటామని తెలిపారు. జిల్లా కార్యవర్గ సభ్యులు అత్తిలి విమల, పాత్రపల్లి చంద్రశేఖర్, కె.సత్యనారాయణ, కె. సత్యాంజనేయ, ఎస్.కె.రెహమాన్, ఎం.మన్మథరావు, క్షేత్రపాల్, జి.రాంబాబు పాల్గొన్నారు.